
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 23 । జూలై । 2025





**సోమశిలలో 27.510 టీఎంసీలు**

జలాశయంలో మంగళవారానికి 27.510 టీఎంసీలు ఉన్నాయి. 3,856 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, పెన్నార్ డెల్టాకు 4,200, ఉత్తర, దక్షిణ కాలువలకు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.1,02,570 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.9,285 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.9,564 |
| సవర (8 గ్రాములు) | రూ.76,512 |

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం
32.8 /26.8

జిల్లాలో బుధవారం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 63 శాతంగా నమోదైంది.

# రవాణాపై టార్గెట్ కత్తి

**ఆదాయ వనరుగా మార్చుకున్న ప్రభుత్వం**

- వాహనాలపై భారీ అపరాధాలు బాదుడు
- ఏటా టార్గెట్‌ను పెంచుతున్న వైనం
- లైసెన్స్, ఆర్‌సీ, పొల్యూషన్ పత్రాలు, ఓవర్‌లోడ్ పేర్లతో కేసుల నమోదు
- వరుస కేసులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- నూరు శాతం లక్ష్యం పూర్తి చేయకుంటే మెమోలు జారీ

రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖను ఆదాయ వనరుగా మార్చుకుంది. వాహనాలపై అపరాధ రుసుం పేరుతో రూ.కోట్లల్లో వసూలు చేయాలని రవాణాశాఖాధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది. నూరు శాతం వసూలు లక్ష్యాన్ని అధిగమించలేని అధికారులకు మెమోలు జారీ చేస్తున్నట్లు సమాచారం. దీంతో లైసెన్స్‌లు, ఓవర్‌లోడ్, ఫిట్‌నెస్, నో రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ తదితర పేర్లతో నిత్యం వాహనదారులపై రవాణా శాఖ అధికారులు కేసుల నమోదు చేస్తూ టార్గెట్‌ను రీచ్ అయ్యేందుకు పాట్లు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టార్గెట్ ఉన్నా వాహనదారులను ఇబ్బందులకు గురి చేయకూడదన్న భావనతో అధికారులపై ఒత్తిడి పెంచలేదు.

నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు, చర్యలు రవాణా రంగాన్ని కుదేలు చేస్తోంది. రవాణాశాఖను ఖజానా ఆదాయ వనరుగా మార్చుకున్న ప్రభుత్వం ఆ మేరకు రాబడి లక్ష్యాలను విధించింది. తమపై 'టార్గెట్' కత్తి వేలాడుతుండడంతో వంద శాతం టార్గెట్‌ను పూర్తి చేసేందుకు రవాణా శాఖ అధికారులు వాహనదారులపై కేసుల రూపంలో భారం మోపుతున్నారు.

**62.5 శాతానికి తగ్గిన వాహనాలు**

గతంలో జిల్లాలో 8.08 లక్షలకు పైగా ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఉన్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధిస్తున్న అపరాధ రుసుములు వాహన యజమానులు భరించలేకపోతున్నారు. సరైన కిరాయిలు లేక పోవడం, ఆశించినంత లోడింగ్ లేకపోవడం, డ్రైవర్లు దొరక్క పోవడం, 15 ఏళ్లు నిండి రెన్యువల్ చేసుకోకపోవడం, యాక్సిడెంట్ అయి వాటిని రన్నింగ్‌లో పెట్టకపోవడం తదితర కారణాలతో ఈ వాహనాల సంఖ్య ప్రస్తుతం 5.05 లక్షలకు పడి పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాహనాల సంఖ్య 62.5 శాతానికి తగ్గిపోయాయి. ప్రస్తుతం ఉన్న వాహనాల్లో 3,90,920 బైక్‌లు, 50,189 కార్లు, 11,707 వ్యవసాయ ట్రాక్టర్లు, 3,686 కమర్షియల్ ట్రాక్టర్లు, 18,438 ఆటోలు, 12,116 గూడ్స్ క్యారియర్లు, 1,186 మోటారు క్యాబ్‌లు, 2,101 కమర్షియల్ ట్రైలర్లు, 1,106 విద్యాసంస్థల బస్సులు ఉండగా మిగిలినవి సీసీ బస్సులు, సిటీ బస్సులు, అంబులెన్స్‌లు, మోపెడ్, మూడు చక్రాల గూడ్సు వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు నిత్యం రహదారులపైనే తిరుగుతున్నాయి.



రవాణాశాఖ కార్యాలయం

| ఈ ఏడాదిలో వసూళ్ల లక్ష్యం రూ. 275.13 కోట్లు | |
|---|---|
| గతేడాది వసూలు రూ.221.41 కోట్లు | టార్గెట్‌లో వసూళ్లలో సాధించిన లక్ష్యం 80.47 శాతం |
| ఎంవీఐకు రూ.7 కోట్లు | ఏఎంవీఐకు రూ.9 కోట్లు |



**ఈ ఏడాది**

రూ.275.13 కోట్ల వసూలు లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం రవాణా టార్గెట్‌ను ప్రతి ఏటా పెంచుతూ 100 శాతం లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.275.12 కోట్లు టార్గెట్ విధించగా రూ.221.41 కోట్లు వసూళ్లు చేసి 80.47 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ రూపంలో రూ.9 కోట్లు, యూజర్ చార్జీల రూపంలో రూ.5.21 కోట్లు, చలానా ఫీజులు రూపంలో రూ.17.06 కోట్లు, క్వార్టర్ టాక్స్ రూపంలో రూ.59.21 కోట్లు, లైఫ్ టాక్స్ రూపంలో రూ.184. 65 కోట్లు వసూలు చేశారు.

**ఎంవీఐ, ఏఎంవీఐల ఉక్కిరిబిక్కిరి**

జిల్లాలో మొత్తం 16 మంది మోటారు వాహనాల అధికారులు, అసిస్టెంట్ మోటారు వాహనాల అధికారులు ఉన్నారు. వీరిలో ఎంవీఐకు రూ.7 కోట్లు, ఏఎంవీఐకు రూ.9 కోట్లు వసూళ్లు చేయాలని టార్గెట్ విధించారు. ప్రధానంగా ఈ టార్గెట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ రూపంలోనే వసూలు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో చిన్నచిన్న కారణాలు చూపి రవాణా అధికారులు వాహనదారులపై కేసుల నమోదు చేసి అపరాధ రుసుం రూపంలో ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ముగ్గురు అధికారులు ఉన్నారు. వీరు ఆటోలు, బైక్‌లకు నో హెల్మెట్, లైసెన్స్, పొల్యూషన్, ఇన్స్యూరెన్స్ తదితర పత్రాలు చూపలేదన్న కారణంగా కేసులు నమోదు చేస్తుంటారు. ఇటీవల కాలంలో వాహనాలపై కేసులు నమోదు చేయడం ఎక్కువై పోయిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**లక్ష్యాన్ని అధిగమిస్తాం**

"రాష్ట్ర ప్రభుత్వం విధించి లక్ష్యాన్ని అధిగమిస్తాం. గతేడాది 80.47 లక్ష్యాన్ని సాధించాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 100 శాతం లక్ష్యాన్ని అధిగమిస్తాం. ప్రధానంగా టాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలు, అధిక లోడుతో తిరుగుతున్న వాహనాలు, డ్రంక్ డ్రైవ్, లైసెన్స్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై దృష్టి సారించాం. జిల్లా వ్యాప్తంగా బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తాం." – బి. చందర్, డీటీసీ



## న్యూస్‌రీల్

### 2న స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు వచ్చే నెల 2న జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు జరుగుతాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన 7 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. సమావేశాలకు ఆయా శాఖల జిల్లా అధికారులు, జిల్లా పరిషత్ సభ్యులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

### ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): కేంద్ర కార్మికశాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా బీడీ కార్మికులకు అందజేసే ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానం పలుకుతోందని బీడీ కార్మిక సంక్షేమ ఆస్పత్రి నెల్లూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేవీ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి పీజీ కోర్సులు అభ్యసించే బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రీ మెట్రిక్ కేటగిరీలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 31వ తేదీ చివరి తేదీ కాగా, పోస్ట్ మెట్రిక్ కేటగిరీలో ఇంటర్ నుంచి ఆ పైబడిన కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబర్ 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు స్కాలర్ షిప్ పోర్టల్ www. scholarships. gov. in లాగిన్‌ను సంప్రదించాలని కోరారు.

### నేడు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం

నెల్లూరురూరల్: జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా అభివృద్ధి సమీక్ష (డీడీఆర్‌సీ) కమిటీ సమావేశం జరగనుందని డీపీఆర్‌ఓ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి మహమ్మద్ ఫరూక్, పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొని చర్చించనున్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు హాజరుకానున్నారని తెలిపారు.

### విద్యలో ఆధునికీకరణలు అవసరం

- మంచు లక్ష్మి
- డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ప్రారంభం



మాట్లాడుతున్న మంచు లక్ష్మి

ముత్తుకూరు(పొదలకూరు) : పాఠశాల స్థాయి నుంచే విద్యలో ఆధునికీకరణలు జరగాల్సిన అవసరం ఉందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సినీనటుడు మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి అన్నారు. ఆమె స్థాపించిన 'టీచ్ ఫర్ ఛేంజ్ సంస్థ' సహకారంతో ముత్తుకూరు ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌ను మంగళవారం నెల్లూరు నగరం కోటమిట్ట కృష్ణమందిరం మున్సిపల్ హైస్కూల్ నుంచి మంచు లక్ష్మి ప్రారంభించారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో 12 స్కూళ్లలో డిజిటల్ క్లాస్ రూములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ఒక్కొక్క క్లాస్ రూమ్‌కు రూ.2 లక్షలు వెచ్చించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఈఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### నర్సింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నర్సింగ్ కోర్సుపై ఆసక్తి ఉన్న గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్, యూరోపియన్ యూనియన్ దేశాల్లో నర్సింగ్ కోర్సుల్లో ప్రావీణ్యం పొంది వైద్యసేవా రంగంలో జర్మనీ వంటి దేశాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రాష్ట్రంలో మూడు కేంద్రాల్లో 75 మందికి జర్మన్ లాంగ్వేజ్, 9 నుంచి 10 నెలల పాటు నర్సింగ్‌లో డిగ్రీ చదివిన గిరిజన యువతులకు ఉచిత వసతితో కూడిన శిక్షణకు గిరిజన సంక్షేమ శాఖతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. బీఎస్సీ నర్సింగ్‌లో రెండేళ్ల క్లినికల్ అనుభవం జీఎన్‌ఎంలో 3 ఏళ్ల అనుభవం కలిగిన 35 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులన్నారు. ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేషన్ కలిగి ఉండాలన్నారు. జర్మన్ ల్యాంగ్‌లో 8 నుంచి 10 నెలల శిక్షణ, బీ2 స్థాయి పరీక్ష ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఐటీడీఏ కార్యాలయ సెంటర్ మేనేజర్ ఎం బాలాజీని 81878 99877, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం 95026 77311 నంబర్లలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

## సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్): సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించడంలో అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ శ్రీనివాస్ కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం వివిధ శాఖల అధికారులతో మంగళవారం జిల్లా కోర్టులోని జడ్జి చాంబర్‌లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి తేజోవతి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వైఓ నందన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, రవాణాశాఖాధికారి మొహమ్మద్, కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ సీఈఓ శ్రీనివాసరావు, ఎక్సైజ్ శాఖ, ఫైర్ సర్వీస్, ఎలక్ట్రిసిటీ ఈఈ, ఆర్టీసీ, ఇన్స్యూరెన్స్, చిట్ ఫండ్స్ సంస్థల అధికారులు, పలు కోర్టుల న్యాయమూర్తులు, నెల్లూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'పచ్చ' పైత్యం

- మినరల్ వాటర్ ప్లాంట్‌కు పసుపు రంగు



2011లో గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్



పచ్చ రంగుతో నేడిలా..

కొండాపురం (ఉదయగిరి): కొండాపురం మండలం మన్నంవారిపల్లిలో అధికార పార్టీ నేతలు పచ్చ పైత్యాన్ని ప్రదర్శించారు. గ్రామంలో 2011-12 ఆర్థిక సంవత్సరంలో అప్పటి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన ఎంపీ గ్రాంట్ ద్వారా రూ.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మించారు. ఈ నిధులతో గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్లాంట్‌ను నిర్మించింది. అప్పటి ప్రజాప్రతినిధులు ప్లాంట్ ప్రారంభించి గ్రామ పంచాయతీకి అప్పగించారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది అధికార పార్టీ కార్యకర్తలు అధికారులు, పంచాయతీ అనుమతి లేకుండా ప్లాంట్‌కు పసుపు రంగు వేసి తమ పచ్చ పైత్యాన్ని చాటుకున్నారు. ఎంపీ గ్రాంట్‌తో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌కు టీడీపీ పసుపు రంగు వేయడంపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ వివాదాలకు దారితీసే ఈ చర్యపై సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## సైదాపురం ఎంపీడీఓ సస్పెన్షన్

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆరోపణల నేపథ్యంలో సైదాపురం ఎంపీడీఓ పి.శివకుమార్‌ను సస్పెండ్ చేస్తూ జెడ్పీ సీఈఓ మోహన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోపణలపై జరిపిన విచారణలో నిజాలు నిగ్గుతేలడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శివకుమార్‌కు సైదాపురం ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## షుగర్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారానికి కృషి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



కోవూరు: కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. మండలంలోని పోతిరెడ్డిపాళెంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి మంగళవారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చక్కెర కర్మాగారం రైతులు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను పూర్తిగా చెల్లించేందుకు చర్యలు వేగవంతం చేశామన్నారు. వీలైనంత త్వరలోనే ఒక పరిష్కారం చూపిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని రామాయపట్నంలో బీపీసీఎల్ పరిశ్రమ ఏర్పాటవుతుందని, దీంతో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కోవూరు చక్కెర కర్మాగారం సమస్యను త్వరగా పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ మంచి పరిపాలన అందించడమే లక్ష్యంగా తామంతా పని చేస్తున్నామని చెప్పారు. తొలుత కోవూరు చక్కర కర్మాగారాన్ని ఎమ్మెల్యేతో కలిసి మంత్రి టీజీ భరత్ పరిశీలించారు.

## అధికార దుర్వినియోగానికి పాల్పడలేదు

- మంత్రిగా అధికారులతో అత్యంత గౌరవం ప్రదర్శించాను
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే అక్రమ కేసులు
- మీరు ఒక్క ఆధారమూ చూపించలేదు
- రెండో రోజూ ఎక్సైజ్ అధికారులు విచారణలో మాజీమంత్రి కాకాణి



వాంగ్మూలాలతో తప్పుడు కేసులా?

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'నేను అధికారంలో ఉన్నప్పుడు ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడలేదు. ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో అత్యంత గౌరవ భావంతో వ్యవహరించాను. ఏ రోజు నా రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెట్టమని పురమాయించనూ లేదు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక, ధైర్యం లేక నేను వారి అవినీతిని ప్రస్తావించడాన్ని తట్టుకోలేక, నన్ను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ సహకారంతో నాపై మోపుతున్న అనేక అక్రమ కేసులు పరంపరలో భాగంగానే ఇది మరో అక్రమ కేసు. అంతే తప్ప ఈ కేసులో ఎలాంటి వాస్తవాలు లేవు' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎక్సైజ్ శాఖ అధికారుల ప్రశ్నలకు సూటిగా సమాధామిచ్చారు. పొదలకూరు మండలం ఇరువూరులో మద్యం అక్రమ నిల్వల కేసులో కోర్టు ఆదేశాల మేరకు మాజీ మంత్రి కాకాణిని రెండు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారణ జరిపారు. పోలీస్ శిక్షణా కేంద్రంలో రెండో రోజు మంగళవారం ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టారు. రెండో రోజు 25 ప్రశ్నలకు కాకాణి దీటుగా సమాధానం ఇవ్వడంతోపాటు కాకాణి ప్రశ్నలకు నీళ్లు నమలాల్సి వచ్చిందని కాకాణి న్యాయవాది చంద్రశేఖర్ తెలిపారు. వాంగ్మూలాలు ఏ పాటి విలువ ఉంటుందో మీకు తెలుసు. గిట్టని వాడు చేసే ఆరోపణలు, ఇచ్చే వాంగ్మూలాలు పక్కన పెట్టి నేను పదే పదే కోరినట్లు ఈ కేసులో నా పాత్ర ఉన్నట్లు మీరు నిర్ధారించి, ఆధారాలు చూపిస్తే నేరుగా న్యాయమూర్తి దగ్గర తప్పు ఒప్పుకొని న్యాయస్థానం విధించే శిక్షను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను. కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయకుండా మోసగించడంతో మోస పూరిత పోకడలను నేను పదే పదే ప్రశ్నించడంతో వాస్తవాలు ప్రజలకు తెలిసి పోతున్నాయని మా నోళ్లు మూయించేందుకు అక్రమ కేసు బనాయించి నిర్బంధించాలన్న కుట్రలో భాగమే ఈ అక్రమ కేసు తప్ప మరొకటి కాదు. నేను 2014, 2019 ఎన్నికల్లో సర్వేపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించాను. జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మంత్రిగా పనిచేశా. ఎన్నడూ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు సాగించడం, అక్రమ మార్గాలు అనుసరించడం ఎన్నడూ చేయలేదు. మీరు నిందితులను ముఖాముఖి తీసుకుని వస్తే అసలు ఫిర్యాదుదారు నాకు పరిచయం ఉన్నాడా? లేదా? అనే విషయం స్పష్టమవుతుంది. అవన్నీ వదిలేసి అడ్డదారులెందుకని ఎక్సైజ్ అధికారుల పరంపరలో కాకాణి చెప్పినట్లు ఆయన తరపు న్యాయవాది తెలిపారు.

## కాకాణికి ముగిసిన ఎక్సైజ్ అధికారుల కస్టడీ

నెల్లూరు (లీగల్): పొదలకూరు మండలం విరువూరులో అక్రమంగా మద్యం నిల్వలు ఉంచారనే కేసులో 9వ నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండు రోజుల ఎక్సైజ్ అధికారుల కస్టడీ మంగళవారంతో ముగిసింది. కోర్టు అనుమతితో జిల్లా కేంద్ర కారాగారం నుంచి పొదలకూరు ఎక్సైజ్ అధికారులు కస్టడీకి తీసుకుని జైలు సమీపంలోని జిల్లా పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌లో కాకాణి తరపున న్యాయవాది కోరికల చంద్రశేఖర్, పొదలకూరుకు చెందిన వీఆర్వోలు ముసునూరు మస్తాన్, అల్లాడి శ్రీనివాసులు మధ్యవర్తుల సమక్షంలో పొదలకూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు విచారణ జరిపారు. రెండో రోజు అడిగిన 25 ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కోర్టు గడువు ముగియడంతో గోవర్ధన్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేయించిన అనంతరం గూడూరు అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి బీవీ సులోచనరాణి ఉత్తర్వులు మేరకు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

## ప్రతి బిడ్డ సంరక్షణను బాధ్యతగా భావించండి

- అంకితభావంతో విధులు నిర్వహిస్తే మెరుగైన ఫలితాలు
- ఐసీడీఎస్ అధికారులకు కలెక్టర్ ఆనంద్ దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న ప్రతి బిడ్డ సంరక్షణను ఒక బాధ్యతగా భావించండి. చిన్నారుల బరువు, ఎత్తును సక్రమంగా నమోదు చేయండి. బలహీనంగా ఉన్న చిన్నారుల జాబితాను తయారు చేసి పౌష్టికాహారం క్రమం తప్పకుండా ఇవ్వండి. అంకితభావంతో విధులు నిర్వహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని ఐసీడీఎస్ అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఉద్బోధించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనాసుజన్ ప్రాజెక్ట్‌ల్లో చేపడుతున్న పలు కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మంచి పోషణ అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు సీడీపీఓలు, సూపర్‌వైజర్లు ఒక బాధ్యతగా భావించాలని సూచించారు. బలహీనంగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారి తల్లిదండ్రులను కలిసి మాట్లాడాలని, వైద్యులను తీసుకెళ్లి చూపించాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల భర్తీకి సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ కార్డు లేని చిన్నారులను గుర్తించి త్వరగా ఇప్పించేందుకు ఎంపీడీఓలను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో సీడీపీఓలు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## రుణాల కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలి

- ఏఎస్పీసీహెచ్ సౌజన్యకు వినతి



ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు, సంక్షేమ సంఘ నాయకులు

నెల్లూరు (క్రైమ్): బ్యాంకు రుణాల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేయాలని బాధితులు యానాదుల సంక్షేమ సంఘం నాయకులతో కలిసి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు వినతిపత్రం అందజేశారు. యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ జాలె వాసుదేవనాయుడు, అల్లాభక్షు, శివ, వెంకట్ జిల్లాలోని కొందరు నిరుపేద ఎస్సీ, ఎస్టీలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించి నెల్లూరు, ముత్తుకూరు యాక్సిస్ బ్యాంకుల్లో పెద్ద ఎత్తున రుణాలు తీసుకుని మోసగించారన్నారు. ఈ వ్యవహారంలో కొంత మంది బ్యాంకు సిబ్బంది ప్రమేయం ఉందన్నారు. రుణాల కుంభకోణంపై ఎనిమిది నెలల కిందట కేసు నమోదైనప్పటికీ ఇంతవరకూ విచారణ సాగలేదన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు చలంచర్ల లక్ష్మీనారాయణ, మోకా తనూజ, వాసు, యానాదుల సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ ఆర్.కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష నాగరాజు, మాజీ డీవీఎంసీ సభ్యులు కొప్పోలు రఘు, డీవీఎంసీ సభ్యులు సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వీఎస్‌యూలో అడ్మిషన్ల గడువు పొడిగింపు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ కోసం అడ్మిషన్ల గడువును ఈనెల 31 తేదీ వరకు పొడిగించినట్లు డీఓఏ డైరెక్టర్ డాక్టర్ ఎం.హనుమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ నాలుగు సంవత్సరాల హానర్స్, నాలుగు సంవత్సరాల హానర్స్ విత్ రీసెర్చ్ పాసైన విద్యార్థులు పీజీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీకి అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం వీఎస్‌యూలోని డీఓఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలియజేశారు.

### రైలు కింద పడి..

- వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు గానీ రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి నెల్లూరు – వేదాయపాళెం మధ్యలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై చోటుచేసుకుంది. మృతుడి వయసు 65 నుంచి 70 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. పసుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, పసుపు రంగు పంచె, కాషాయ రంగు టవల్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అక్రమంగా జామాయిల్ నరికివేత



లారీలో లోడు చేసిన జామాయిల్ కర్ర

దుత్తలూరు: మండలంలోని భైరవరం పంచాయతీ మజరా గ్రామమైన తురకపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వల్లెం మల్లారెడ్డికి చెందిన పొలంలో టీడీపీ నాయకులు అక్రమంగా జామాయిల్ నరికి అమ్మే ప్రయత్నం చేశారు. భైరవరం రెవెన్యూ సర్వే నంబర్ 367లో 2.50 ఎకరాల భూమిలో మల్లారెడ్డి పదేళ్ల క్రితం జామాయిల్ సాగు చేపట్టారు. అయితే ఇదే సర్వే నంబర్‌లో కొంత భూమి కలిగి ఉన్న టీడీపీ నేత బోగిరెడ్డి ఓబుల్‌రెడ్డి మంగళవారం జామాయిల్ కర్ర కొట్టించారు. లారీకి లోడు చేయించి తరలిస్తుండగా బాధితుడు తహసీల్దార్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందిని పంపించి లారీని స్వాధీనం చేసుకుని దుత్తలూరు పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆ భూమి వివాదాస్పదంలో ఉన్నందున ఎవరూ ప్రవేశించరాదని బోర్డు పెట్టడం జరిగిందన్నారు. నిబంధనలు అతిక్రమించి ప్రవేశించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



హైవేకు వెళ్లే దారిలో ఎన్ని గుంతలో..



ఆర్టీసీ బస్సు వెళ్లేందుకు ఎన్ని తిప్పలో..



ఇది ఏదో దేశం మ్యాప్‌లా కనిపిస్తుంది కదా..



ఇది రోడ్డు కాదు.. నరకం

# కీలక రోడ్డు.. నరకప్రాయంగా మారి

నిద్ర లేచింది మొదలు జిల్లాలో కూటమి పెద్దలు అది చేశాం.. ఇది చేశామని గొప్పలు చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. దోచుకోవడంపైనే దృష్టి పెట్టిన నేతలు ప్రజల కనీస అవసరాల గురించి పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటిపోయింది. కానీ రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు మంత్రులుగా ఉన్నా ఒరిగింది శూన్యం. రూరల్ నియోజకవర్గంలో రూ.కోట్లతో పనులు చేశామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెబుతుంటారు. కానీ తన పరిధిలోని ప్రధాన రహదారి అభివృద్ధిని గాలికొదిలేశారు. నేషనల్ హైవే నుంచి హరనాథపురం వెళ్లే కీలక రోడ్డు నరకప్రాయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి గుంతల్లో నీరు చేరింది. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు విన్యాసాలు చేయాల్సి వస్తోంది. దీని గురించి ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వామ్మో.. గుంత ఎంత లోతున ఉందో..



విన్యాసాలు చేయాల్సిందే..


# విద్యుత్ బిల్లుల 'షాక్'

కావలి మండలం మద్దూరుపాడులోని ఇందిరా సీడ్స్ యజమాని దేవరపల్లి గిరిధర్‌రెడ్డికి కొన్ని సంవత్సరాలుగా ప్రతినెలా రూ.8 వేల్లోపే విద్యుత్ బిల్లు వచ్చేది. కొత్తగా స్మార్ట్ మీటరు అమర్చిన తర్వాత వచ్చిన మొదటి నెల బిల్లు రూ.లక్ష పైనే. దీంతో అతడికి ఏం చేయాలో అర్థం కాలేదు.

- కావలిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- అధికంగా వస్తున్న బిల్లులు
- ప్రజలపై 'కూటమి' భారం




మద్దూరుపాడులోని వాణిజ్య సముదాయానికి స్మార్ట్ మీటరు బిగించకముందు వచ్చిన బిల్లు




అదే వినియోగదారుడికి స్మార్ట్ మీటర్ బిగించిన అనంతరం మెసేజ్ రూపంలో వచ్చిన బిల్లు

కావలి(జలదంకి): కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు కలకలం రేపుతున్నాయి. ఒక్కసారిగా బిల్లులు అధికంగా వస్తుండటంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఒక్క కావలి పట్టణంలోనే సుమారు 12 వేల వరకు స్మార్ట్ మీటర్లు బిగించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గృహాలకు కూడా బిగించే పనిలో సిబ్బంది ఉన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే విద్యుత్ పంపిణీ సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కొంతమంది సిబ్బందితోపాటు మీటర్ రీడర్లు కూడా ఉద్యోగాలు కోల్పోయే అవకాశాలున్నాయి. కాగా స్మార్ట్ మీటర్లు అమర్చిన తర్వాత వస్తున్న బిల్లులు చూసి వినియోగదారులకు షాక్ అవుతున్నారు. ప్రతినెలా రూ.6 వేల నుంచి రూ.8 వేలు వచ్చే బిల్లులు నేడు రూ.లక్షల్లో వస్తుండటంతో వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు. ఒకేసారి రూ.లక్ష పైన బిల్లు ఎందుకు వస్తుందని వారు విద్యుత్ సిబ్బందిని అడిగితే ఈసారికి నగదు కట్టండి తర్వాత సరిచేస్తామని చెబుతున్నారు.

**దోచుకోవడమే..**

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం ప్రజల్ని దోచుకుంటోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నెల్లూరులో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొత్తగా విద్యుత్ మీటర్లు బిగించడం వల్ల బిల్లులు అధికంగా వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ విషయంపై ఆయా శాఖాధికారులు చర్యలు చేపట్టాలని అన్నారంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

# నగదు తీసివ్వాలని సాయం కోరితే..

- రూ.40 వేలు తస్కరించిన యువకుడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతు



ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేస్తున్న యువకుడు

పొదలకూరు: ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేయడం తెలియక ఓ రైతు అక్కడే ఉన్న యువకుడిని సాయం కోరగా అతను రూ.40 వేలు తస్కరించాడు. మంగళవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. చేజర్ల మండలం నూతకివారికండ్రిక గ్రామానికి చెందిన యనమల పెంచలకృష్ణారెడ్డి సోమవారం పొదలకూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కనే ఉన్న ఏటీఎంలో రూ.5 వేలు డ్రా చేసేందుకు వెళ్లాడు. అయితే ఆయనకు ఏటీఎం ఆపరేటింగ్ తెలియదు. దీంతో అక్కడే ఉన్న గుర్తుతెలియని ఓ యువకుడిని నగదు విత్‌డ్రా చేసి ఇవ్వాల్సిందిగా కోరాడు. అతను పెంచలకృష్ణారెడ్డి ఏటీఎం తీసుకుని పిన్ నంబర్ తెలుసుకుని ఆపరేట్ చేస్తున్నట్టు నటించి ఎందువల్లనో నగదు రావడం లేదన్నాడు. అయితే మోసగాడు బాధిత రైతు ఏటీఎం ఇవ్వకుండా తన కార్డు ఇచ్చాడు. పెంచలకృష్ణారెడ్డి గమనించకుండా మార్చి ఇచ్చిన కార్డు తీసుకుని తమ ఊరి పక్కనే ఉన్న ఏటూరు బ్యాంకులో నగదు తీసుకునేందుకు వెళ్లాడు. ఈలోగా యువకుడు మూడుసార్లు పెంచలకృష్ణారెడ్డి ఏటీఎం నుంచి రూ.40 వేలు విత్‌డ్రా చేశాడు. బాధితుడి ఫోన్‌కు మెసేజ్‌లు వెళ్లినా తెలుసుకోలేకపోయాడు. బ్యాంక్ వద్దకు వెళ్లి అకౌంట్లో నగదు పరిశీలించగా రూ.లక్షకు బదులు రూ.60 వేలే ఉంది. వెంటనే అప్రమత్తమై ఉన్న రూ.60 వేలను బాధిత రైతు డ్రా చేశాడు. మంగళవారం గ్రామపెద్దలతో మాట్లాడి పొదలకూరు ఎస్‌బీఐ సిబ్బంది వద్దకు వెళ్లి జరిగిన మోసాన్ని వివరించాడు. సీసీ టీవీ ఫుటేజీని తీసుకుని పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

### నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.27
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

### పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) : 134 | బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264 |
| లేయర్ (లైవ్) : 112 | |
| బ్రాయిలర్ చికెన్ : 240 | లేయర్ చికెన్ : 190 |

# భూసేకరణను ఆపాలని డిమాండ్



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

ఉలవపాడు: బలవంతపు భూసేకరణను నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో వారి బృందం పర్యటించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా భూసేకరణ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రావూరు, చేవూరు గ్రామాల రైతులు న్యాయపరంగా హైకోర్టును ఆశ్రయించారన్నారు. అధికార పార్టీ నాయకులు ప్రజలను చీల్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ భూములను ధ్వంసం చేయొద్దన్నారు. పరిశ్రమలు, కార్పొరేట్ కంపెనీల అవసరాల కోసం రైతులతో ఆటలాడొద్దన్నారు. ప్రజల మాటలను గౌరవించి నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ గతంలో కృష్ణపట్నం పోర్టు సమీపంలో రిలయన్స్‌కు 2,800 ఎకరాలు, కిసాన్ సెజ్ కోసం 2,500 ఎకరాలు సేకరించారన్నారు. వారు పరిశ్రమలు కట్టకుండా ఈ భూములపై లోన్లు తీసుకుని వారు వ్యాపారాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పోలీసులతో బెదిరించి ప్రజలను ఖాళీ చేయించాలని చూస్తే భూసేకరణకు వ్యతిరేకంగా వచ్చే అన్ని పార్టీలతో కలిసి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు కుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి, ఇంకా పోట్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతానికి గురై..

- వ్యక్తి మృత్యువాత



పొలంలో విగతజీవిగా చిన్నయ్య

విడవలూరు: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని అన్నారెడ్డిపాళెంలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... ముదివర్తి గాంధీనగర్ గ్రామానికి చెందిన సిద్ధపరెడ్డి చిన్నయ్య (37) అనే వ్యక్తి కొంతకాలంగా అన్నారెడ్డిపాళెంలో నివాసముంటూ పొలం పనులు చేస్తున్నాడు. మంగళవారం అదే గ్రామానికి చెందిన బండ్ల శంకరయ్య అనే వ్యక్తి పొలంలో గడ్డి కోసేందుకు వెళ్లాడు. శంకరయ్య పొలం నుంచి బడ్ల రమణయ్య పొలంలోకి స్టార్టర్ వైరు కిందకు లాగి ఉంది. వైరుకు చిన్నయ్య తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య బుజ్జమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు.

### మోటార్‌బైక్‌పై వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శ్రీహరి (ఫైల్)

అల్లూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన అల్లూరు గోదాముల వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. అల్లూరు పురిణి మందిరం గ్రామానికి చెందిన నొంగులూరు శ్రీహరి (28) ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతను బైక్‌పై మోపూరు నుంచి అల్లూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో గోదాముల నుంచి ప్రధాన రహదారి అల్లూరు వైపునకు తిరుగుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఇంకా ఎదురుగా నెల్లూరు వైపు వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొని శ్రీహరి రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమై మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

### మద్యం దుకాణంలో చోరీ

రాపూరు: కోటూరుపాడు మార్గంలో ఉన్న మద్యం దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సోమవారం రాత్రి నిర్వాహకులు దుకాణానికి తాళాలు వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికెళ్లి పరిశీలించి 4 కేసుల 29 మద్యం బాటిళ్లు, రూ.11,800 నగదు చోరీ చేసినట్టు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.